# పాత రికార్డులను డిజిటలైజేషన్ చేయాలి

- గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా
- బల్దియాలోని అన్ని విభాగాల్లో తనిఖీ


పాత రికార్డుల గదిని పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, జూలై 3 : బల్దియాలోని పాత రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కార్యాలయంలోని అన్ని ఫ్లోర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్ని విభాగాలకు వెళ్లి పని విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల గదిని పరిశీలించిన ఆయన పాత దస్త్రాలను స్కానింగ్ తీశారా? అని అడిగి తెలుసుకున్నారు. గతంలో కొన్ని రికార్డులను స్కానింగ్ చేశామని అధికారులు కమిషనర్‌కు వివరించారు. మిగతా రికార్డులను కూడా డిజిటలైజేషన్ చేయాలని కమిషనర్ సూచించారు. కార్పొరేషన్‌లో విలీనమైన 42 గ్రామాల రికార్డుల గురించి ఆరా తీశారు. అన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేవలం 15 గ్రామాల రికార్డులు మాత్రమే అందజేశారని మరో 27 గ్రామాల రికార్డులు అందజేయాల్సి ఉందని అధికారులు కమిషనర్‌కు వివరించారు. వెంటనే ఆయా గ్రామాల రికార్డులను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

**గ్రీవెన్స్ వినతులకు ప్రాధాన్యమివ్వాలి**

బల్దియా గ్రీవెన్స్‌లో బాధితులు ఇచ్చిన ప్రతి వినతి, ఫిర్యాదుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. సోమవారం బల్దియా గ్రీవెన్స్‌లో ఆయన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. గ్రీవెన్స్ వినతులపై క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కారమైన తర్వాత దాని ఫొటో జత చేయాలని సూచించారు. ప్రతి మూడో శని వారం అదనపు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌ఈలు గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేసి ప్రతి వారం పరిష్కారమైన వాటిని నమోదు చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. పూడిక తీత పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పైపులైన్ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఇప్పటి ఇరకు ఆస్తి పన్ను డిమాండ్ నోటీసుల పంపిణీ వివరాలు అందచేయాలన్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 87 వినతులు రాగా, టౌన్ ప్లానింగ్ విభాగానికి 31, తాగునీటి విభాగానికి 14, ఇంజనీరింగ్ విభాగానికి 21, ప్రజారోగ్య విభాగానికి 7, పన్నుల విభాగానికి 12, ఎలక్ట్రిసిటీ విభాగానికి 2 వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రవీందర్ యాదవ్, ఇన్‌చార్జి అదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, ఎస్‌ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, సీహెచ్‌వో శ్రీనివాసరావు, ఆర్‌ఎఫ్‌వో పాపయ్య, డీఎఫ్‌వో శంకర లింగం, ఎంహెచ్‌వో డాక్టర్ జ్ఞానేశ్వర్, డిప్యూటీ కమిషనర్లు జోనా, శ్రీనివాస్‌రెడ్డి, డీపీపీ ప్రకాశ్‌రెడ్డి, ఐటీ మేనేజర్ రమేశ్, సూపరింటెండెంట్ జీవన్, సీనియర్ అసిస్టెంట్ డేవిడ్ రాజ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


యువజనోత్సవం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## యువజనోత్సవాన్ని విజయవంతం చేయాలి

**కలెక్టర్ సిక్తా పట్నాయక్**

హనుమకొండ, జూలై 3 : జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను నెహ్రూ యువ కేంద్రం యూత్ ఆఫీసర్ చింతల అన్వేశ్‌తో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్రం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ సౌజన్యంతో హనుమకొండ వడ్డేపల్లి పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనే వారు ముందుగానే ఆన్‌లైన్‌లో https://forms.gle/i731NzteFpzeTSYPA లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఒక్కొక్క కాంపిటీషన్‌కు పరిమితితో కూడిన నిబంధనలు ఉండడం వల్ల త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 0870-2958776, 99080 69469, 97004 09497 నంబర్లలో కానీ, హనుమకొండలోని బస్టాండ్ సమీపంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో కానీ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా గణాంక దర్శిని విడుదల**

హనుమకొండ - 2022 జిల్లా గణాంక దర్శిని పుస్తకాన్ని(హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్) కలెక్టర్ సిక్తా పట్నాయక్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గణాంక దర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, నీటి వనరులు, పంటలు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, లోకల్ బాడీ ఇండస్ట్రీస్, సోషల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు వివరంగా ఉంటాయన్నారు. అనంతరం కలెక్టర్ ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీవో సత్యనారాయణరెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీపీవో జగదీశ్వర్ పాల్గొన్నారు.

**గ్రీవెన్స్ వినతులకు ప్రాధాన్యత ఇవ్వాలి**

హనుమకొండ, జూలై 3 : గ్రీవెన్స్ సందర్భంగా వస్తున్న వినతులు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. కాగా వివిధ సమస్యలపై 118 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అందులో రెవెన్యూ, డబుల్ బెడ్ రూం, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు సంబంధించినవే ఎక్కువ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వోఎం. వాసు చంద్ర, డీఆర్‌డీవో ఎ. శ్రీనివాస్‌కుమార్, సీపీవో సత్యనారాయణరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి**

దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. కుల సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## జర్నలిస్టులు స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూలై 3 : ఏకశిలా, కాకతీయ హౌసింగ్ సొసైటీల్లో సభ్యులుగా లేని జర్నలిస్టులు ఈ నెల 5, 6 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో దరఖాస్తు చేసుకోవాలని సిక్స్‌మెన్ కమిటీ తీర్మానించింది. వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి అందించాల్సిన నివేశన స్థలాల కోసం ఏర్పడ్డ ఈ కమిటీ సోమవారం సమావేశం నిర్వహించింది. కన్వీనర్ బీఆర్ లెనిన్, సభ్యులు బొక్క దయాసాగర్, వేముల నాగరాజు, గడ్డం రాజిరెడ్డి, మస్కపురి సుధాకర్, బొల్లారపు సదయ్య పాల్గొని ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, కాకతీయ, ఏకశిల హౌసింగ్ సొసైటీల బాధ్యులు వారి జాబితాలను మంగళవారం సాయంత్రంలోగా సిక్స్‌మెన్ కమిటీకి అందించాలని సూచించారు. అంతేకాకుండా సిక్స్‌మెన్ కమిటీలో కన్వీనర్‌కు అత్యవసర సమయంలో చేదోడు, వాదోడుగా ఉండేందుకుగాను సభ్యులుగా ఉన్న బొక్క దయాసాగర్, వేముల నాగరాజును కో-కన్వీనర్లుగా కొనసాగించాలని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

## టీవీఎస్వీ వరంగల్ సిటీ అధ్యక్షుడిగా విష్ణువర్ధన్



హనుమకొండ చౌరస్తా, జూలై 3: తెలుగు వెలుగు సాహితీ వేదిక(టీవీఎస్వీ) వరంగల్ ట్రై సిటీ అధ్యక్షుడిగా డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్‌ను నియమించారు. ఈ మేరకు వేదిక వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వలబోజు మోహన్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు. కేయూలో ఉద్యోగిగా పనిచేస్తున్న విష్ణువర్ధన్ తన ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నందున ఆయనను నియమించినట్లు పేర్కొన్నారు.

## కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కలిసిన దేవునూర్ రైతులు

ధర్మసాగర్, జూలై 3: మండలంలోని దేవునూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గుడివెనుక దేవేందర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిశారు. గ్రామానికి చెందిన సుమారు 100 మంది రైతులకు 1991-92లో సర్వే నంబర్ 531, 536లోని భూమికి లవన్ పట్టాలు ఇచ్చారని, అయితే, వాటిని కొత్త పట్టా పాస్‌బుక్‌లు రాలేదని తెలిపారు. ఇప్పటికైనా తెలంగాణ పట్టాదార్ పాసుబుక్కులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. దీంతో కలెక్టర్ విషయాన్ని ఆర్డీవో వాసుచంద్రకు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు సర్వే కోసం వచ్చినప్పుడు మోఖా మీద ఉండాలని రైతులకు సూచించారు. వారిని గుర్తించి పట్టాలు ఇచ్చే ప్రక్రియ చేపడుతామని తెలిపారు.

## విభజన హామీలపై మోదీ సమాధానం చెప్పాలి

**సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

నయీంనగర్, జూలై 3 : తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసన సభా పక్ష నాయకుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8న ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటన నేపథ్యంలో విభజన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమతో పాటు ఏదేని సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థానంలో వ్యాగన్ ఓవర్ హాలింగ్, వ్యాగన్ల తయారీ యూనిట్ ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గడిచిన తొమ్మిదేళ్ల పాలనలో కోచ్ ఫ్యాక్టరీలను గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలించుకుపోయిన నరేంద్ర మోదీ వెనుకబడిన తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణలోని ఏదో ఒక సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని, తెలంగాణ ఉద్ధరిస్తామని చెబుతున్న బీజేపీ మాటలు తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తెలంగాణ విభజన హామీలు అమలు చేయకుండా వరంగల్ నగరంలో అడుగు పెట్టే అర్హత మోదీకి లేదని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై కేంద్రం ఎందుకు వివక్ష చూపుతుందో బీజేపీ నాయకులే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ఎన్నికల స్టంట్ కోసం కోచ్ ఫ్యాక్టరీ స్థానంలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశాన్ని తెరపైకి తెస్తున్నారన్నారు. బీజేపీని గద్దె దించడమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, నాయకులు ఉట్కూరి రాములు, మంచాల రమాదేవి, భాషబోయిన సంతోష్ ఉన్నారు.

## పోడు భూముల పట్టాల పంపిణీ వేగవంతం చేయాలి

**కలెక్టర్లకు సీఎస్ శాంతి కుమారి ఆదేశాలు**

హనుమకొండ, జూలై 3 : పోడు భూముల పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో పోడు భూముల పట్టా పంపిణీ పురోగతి, గృహలక్ష్మి పథకం, ఎరువులు, విత్తనాల నిల్వలు, తెలంగాణ హరితహారం, బీసీ చేతివృత్తుల వారికి ఆర్థికసాయం గొర్రెల పంపిణీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. హనుమకొండ జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, డీఆర్‌వో ఎం వాసు చంద్ర, డీపీవో వీ జగదీశ్వర్ అధికారులు పాల్గొన్నారు.

## నేడు లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం

న్యూ శాయంపేట, జూలై 3: న్యూశాయంపేటలో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ నూతన కార్యవర్గం మంగళవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పూర్వ అధ్యక్షుడు కొంగ మోహన్ తెలిపారు. కార్యవర్గం నూతన అధ్యక్షుడిగా సయ్యద్ సర్వారొజుద్దీన్, కార్యదర్శిగా రాయబరపు వినోద్ ఆనంద్, కోశాధికారిగా తెరాల రమేశ్‌బాబుతో పాటుగా కార్యవర్గం పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వెంకటేశ్వర్లు, పూర్వ గవర్నర్లు, క్లబ్ సభ్యులు పాల్గొంటారని వివరించారు.

## దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

వరంగల్, జూలై 2 : తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటుకు చొరవ చూపాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. ఈ మేరకు మేయర్ గుండు సుధారాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉర్సు బైపాస్ రోడ్డులో విగ్రహం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


ఉత్తరాన్ని చీఫ్ విప్‌కు అందజేస్తున్న సంఘం నాయకులు

## చీఫ్ విప్‌ను కలిసిన మున్నూరు కాపులు

హనుమకొండ, జూలై 3 : మున్నూరు కాపుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌ను మున్నూరు కాపు సంఘం నాయకులు కోరారు. సోమవారం బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి పెరుకారి శ్రీధర్, కార్పొరేటర్ ఏనుగుల మానస రాజేంద్రప్రసాద్, మున్నూరు కాపు సంఘం 8వ డివిజన్ అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీనివాస్, జంగిలి విజేందర్ పాల్గొన్నారు.